సాక్షి
చిత్తూరు
బుధవారం। 4। జనవరి। 2023



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,060
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,000
రిటైల్ వెండి గ్రాము	రూ.71



	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	29	18
తిరుపతి	29	20
తిరుమల	24	16
గూడూరు	31	22
నగరి	30	20

కాలనీలకు విద్యుత్ పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని జగనన్న కాలనీలకు విద్యుత్ పరికరాలు వచ్చాయని ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం ఈఈ రమణ తెలిపారు. విద్యుత్ మీటర్ బోర్డులు 4 వేలు, కండక్టర్లు 150 కిలోమీటర్లు, ఎర్త్ పైపులు వెయ్యి వచ్చాయన్నారు. అలాగే వీధుల్లో ఏర్పాటు చేసే 315 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 2 వచ్చాయని, వీటిని సంబంధిత ఏఈలు వర్క్ ఆర్డర్లు పెట్టి జిల్లా స్టోర్ నుంచి తీసుకెళ్లాలన్నారు.

టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన నేపథ్యంలో కుప్పం నియోజకవర్గ ప్రజలు హడలిపోతున్నారు. ఆయన పాదం పెట్టిన చోటల్లా అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. మొన్న నెల్లూరు జిల్లా కందుకూరులో ఎనిమిది మంది, నిన్న గుంటూరు ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంపై మదనపడుతున్నారు. ఇప్పుడు కుప్పం వస్తే ఎలాంటి అనర్థాలు జరుగుతాయోనని చర్చించుకుంటున్నారు. స్థానికులనే కాకుండా.. టీడీపీ నేతలు సైతం ఎప్పుడు.. ఎలాంటి ఘటనలు ఎదురవుతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయంపై టీడీపీ ముఖ్యనేతలు వరుసగా రెండు రోజులు సమావేశాలు నిర్వహించి.. 'మనకు ఇదేం ఖర్మరా బాబూ' అంటూ విస్మయం వ్యక్తం చేసినట్టు సమాచారం.



మాకు.. ఇదేం ఖర్మరా బాబు!

కుప్పంలో భయం భయం
- నేటి నుంచి చంద్రబాబు పర్యటన
- హడలిపోతున్న స్థానికులు
- కందుకూరు, గుంటూరు ఘటనలను గుర్తుచేసుకుంటున్న వైనం
- ఎలాంటి ఘటనలు ఎదురవుతాయోనని ఆందోళన

సాక్షి ప్రతినిధి, తిరుపతి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఖరారైంది. బుధ, గురు, శుక్రవారాల్లో ఆయన కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బాబు పర్యటన షెడ్యూల్ ఇప్పటికే పలుమార్లు ఖరారైనా స్థానిక నేతలు సుముఖంగా లేకపోవడం.. జన సమీకరణకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో వాయిదాలు పడుతూ వచ్చింది. జన సమీకరణ, పర్యటన ఖర్చులు పార్టీ శ్రేణులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేయడంతో తప్పని పరిస్థితుల్లో ఒప్పుకున్నట్లు టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

వస్తే.. గమ్మనుండడుగా?

గతంలో చంద్రబాబునాయుడు తన నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించిన సమయంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి అలజడి సృష్టించారు. ప్రశాంతంగా ఉన్న కుప్పంలో చిచ్చుపెట్టి కేసులు పెట్టే స్థాయికి తెచ్చారు. అనుచిత వ్యాఖ్యలతో జనాన్ని ఉసిగొలిపి కొట్లాటలకు కారణమయ్యారు. పచ్చని పల్లెల్లో వర్గవైషమ్యాలు సృష్టించి వేడుక చూసి వెళ్లిపోయారు. ఇప్పుడు మళ్లీ ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారో.. ఎవరెవరిని ఉసిగొల్పుతారో.. ఈ పర్యటన ఎక్కడికి దారితీస్తుందోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏదో ఒకచోట తాను చెప్పాల్సింది చెప్పి వెళ్లితే బాగుంటుందని హితవు పలుకుతున్నారు.

ఇవి గుర్తులేవా తమ్ముళ్లూ?
- చుట్టపుచూపుగా వచ్చి వెళ్లే చంద్రబాబునాయుడు తన నియోజకవర్గం కుప్పంలో ఇల్లుకూడా నిర్మించుకోలేదు.
- తాగు, సాగునీటి ఇబ్బందులు వెంటాడుతున్నా స్థానికులను పట్టించుకోలేదు.
- హంద్రీ–నీవా నీటిని కుప్పానికి తీసుకొస్తామని ప్రగల్భాలు పలికి మిన్నకుండిపోయారు.
- వృథాగా తమిళనాడుకెళ్తున్న పాలారు నీటికి అడ్డుకట్ట వేయలేకపోయారు.
- కుప్పాన్ని మున్సిపాలిటీ కాదుకదా.. కనీసం రెవెన్యూ డివిజన్ కూడా చేయలేకపోయారు.
- రైల్వే అండర్‌బ్రిడ్జిలు, రోడ్ల అభివృద్ధిని అటకెక్కించారు.
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కలగానే మిగిల్చారు.

నారా పాదం..జనానికి శాపం



చంద్రబాబు ప్రచార ఆర్భాటానికి జనాన్ని బలిపశువులు చేస్తున్నారని జనం గట్టిగా నమ్ముతున్నారు. గోదావరి పుష్కరాల్లో ఫొటో షూట్ కోసం 28 మంది.. ఇటీవల నెల్లూరు జిల్లా కందుకూరులో ఎనిమిది మందిని పొట్టనబెట్టుకోవడం చూస్తే ఆయన పాదం మామూలుది కాదని స్థానికులు చెప్పుకుంటున్నారు. అలాగే గుంటూరులో కానుకలను ఎరవేసి ముగ్గురి ప్రాణాలను హరించేశాడని గుర్తుచేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కుప్పం పర్యటన ఖరారు కావడంతో స్థానికులు 'ఐరన్ లెగ్' వ్యాఖ్యలపై చర్చించుకుంటున్నారు. పబ్లిసిటీ కోసం బలవంతంగా జనాన్ని తరలించి చంపేస్తారేమోనని భయపడుతున్నారు. పర్యటనను వాయిదా వేసుకోమని టీడీపీ శ్రేణులు బ్రతిమలాడినట్లు విశ్వసనీయ సమాచారం. అందుకు చంద్రబాబు ససేమిరా అనడంతో చేసేదిలేక సభలకు ఓకే అన్నట్టు సమాచారం.

ద్వాదశి చక్రస్నానం.. పరవశించిన భక్తజనం




తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. శ్రీవారి పుష్కరిణిలో ఉదయం స్నపన తిరుమంజనం, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. – తిరుమల

తుమ్మలగుంటలో ద్వాదశి రద్దీ



శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి

10లో

రాష్ట్రంలో యువతకు ప్రాధాన్యం



జ్యోతి ప్రజ్వలనలో మంత్రి ఆర్కే రోజా, ఎంపీ గురుమూర్తి తదితరులు

10లో

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం

చిత్తూరు అర్బన్: నగరంలోని కన్నయ్యనాయుడు కాలనీకి చెందిన దిలీప్‌సాయి (19) అనే యువకుడు కనిపించడంలేదని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం మేరకు.. పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో బికామ్ రెండో సంవత్సరం చదువుతున్న దిలీప్ సాయిని ఓ చిన్న విషయమై అతని తండ్రి శంకర్ మందలించాడు. దీంతో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి కనిపించకుండా పోయాడని శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టూటౌన్ ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభ ఊరేగింపులో అపశ్రుతి

చిత్తూరు అర్బన్: నగరంలోని గొడుగుమూరు వద్ద దేవుడి విగ్రహం ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఓటిచెరువు వద్ద ఉన్న రాములవారి విగ్రహాలను స్థానికులు ఓ ప్రభలో ఉంచి, ఊరేగిస్తూ గొడుగుమూరు వైపు వచ్చారు. ఇక్కడ ప్రభకు విద్యుత్ తీగ తగలడంతో కృష్ణమూర్తి అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. వెంటనే స్థానికులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలు కావడంతో వైద్యులు చికిత్స చేశారు. అతడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు సాదర స్వాగతం

రేణిగుంట: రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు మంగళవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. రెండు రోజుల తిరుపతి, తిరుమల పర్యటన నిమిత్తం ఇక్కడకు చేరుకున్న ఆయనకు డీపీఆర్వో బాలకొండయ్య పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించి, స్వాగతం పలికారు.

అభివృద్ధిపై చర్చకు మీరు సిద్ధమా!

- మీ ఐదేళ్లపాలన, మా మూడున్నరేళ్ల పాలన లెక్కలు చూద్దామా?
- ఏ పంచాయతీ అయినా సరే.. లేదా మీ సొంత గ్రామమైనా ఓకే
- మీకు దమ్ముంటే బహిరంగ చర్చకు లైవ్‌లో సిద్ధమేనా?
- మా కంటే మీ పాలనే బాగుందని జనం అంటే నేను రాజీనామా చేస్తా
- మాజీ మంత్రి అమర్‌కు సవాల్ విసిరిన ఎమ్మెల్యే వెంకటేగౌడ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు/గంగవరం: 'పలమనేరు నియోజకవర్గంలో మీ ఐదేళ్ల పాలన.. వైఎస్సార్ సీపీ మూడున్నరేళ్ల పాలనలో ఎవరెంత అభివృద్ధి చేశారో.. మీరు చెప్పిన పంచాయతీకి, మీరు చెప్పిన రోజు, మీరు చెప్పిన సమయానికి వస్తా.. మనమిద్దరమే చర్చిద్దాం.. అందుకు మీరు సిద్ధమేనా?' అని మాజీ మంత్రి అమరనాథరెడ్డికి పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ సవాల్ విసిరారు. మండల కేంద్రమైన గంగవరంలో మంగళవారం ఆయన సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడారు. ఇదేంఖర్మ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రచ్చబండ పేరిట కూర్చొని అమాయకులతో ప్రభుత్వాన్ని కామెంట్ చేయించడం మాజీ మంత్రికి తగదన్నారు. 'మీకు ధైర్యం ఉంటే మనమిద్దరమే గడప గడపకూ వెళ్లి ఎవరి పాలన బాగుందో జనాన్ని అడుగుదామా?' అని అన్నారు. తాము ప్రజలకు మేలు చేసినందునే ధైర్యంగా ఇంటింటికీ వెళుతున్నామన్నారు.త్వరలో మూసేసే టీడీపీకి లాస్ట్‌ఛాన్స్ అంటూ బతిమలాడినా నమ్మేవారెవరూలేరన్నారు. 'మీ సొంత మండలంలోని ఎగువ బందార్లపల్లెలో 30 ఇళ్లపై కరెంట్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, ప్రజలు చెబితే నాలుగు దఫాల ఎమ్మెల్యేగా మీరు పట్టించుకున్నారా?' అని ప్రశ్నించారు. ఇలాంటి చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించని మీరు.. మా హయాంలో ఎన్నో ఫ్యాక్టరీలను తెచ్చాననడం సిగ్గుచేటన్నారు. మీ సొంత గ్రామమైన కెళవాతిలో సీసీ రోడ్డు మంజూరు చేస్తే దానిపై కలెక్టర్‌కు అర్జీ పెట్టి ఆపించింది మీరు కాదా? అని నిలదీశారు. మంత్రి సొంత పంచాయతీ వీరపల్లెలో నాలుగు స్కీమ్‌బోర్లు వేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాదా? అన్నారు. మాట్లాడితే ఈపీపీ నిధులతో రోడ్లు మంజూరు చేసుకొచ్చానని చెబుతున్నారు.. అవేమైనా పలమనేరుకు ప్రత్యేకంగా వచ్చాయా? అన్ని నియోజకవర్గాలకు రాలేదా ? అని ఘాటుగా విమర్శించారు. మీరు మంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యేకంగా పలమనేరు అభివృద్ధి ఏం చేశారో చెప్పాలన్నారు. మా పాలనలో నియోజకవర్గానికి 20 వేల ఇళ్లను మంజూరు చేస్తే మీ పాలనలో పదిఇళ్లు అయినా ఇచ్చారా? లెక్కలేసుకోవాలని సూచించారు. అభివృద్ధిపై ఏదైనా మాట్లాడాలంటే మాజీ మంత్రి, తాను చూసుకుందామని, అనవసరంగా గ్రామాల్లో కెళ్లి అమాయక జనానికి మైకులిచ్చి వారిని రెచ్చగొట్టే పనులు ఇకనైనా మానుకోవాలని ఆయన హితవు పలికారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట


వడమాలపేటలో లబ్ధిదారుకు నూతన పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్కే రోజా

- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

వడమాలపేట : రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర పర్యాటక, యువజన క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మంగళవారం వడమాలపేట ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం రెండు రంగాల్లో పరుగులు పెడుతుందని తెలిపారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌ను అందజేస్తున్నామని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామని, గతంలో పింఛన్ మంజూరు కావాలంటే పింఛన్ తీసుకుంటున్న వారిలో ఎవరో ఒకరు చనిపోతే గానీ, కొత్తవారికి పింఛన్ ఇచ్చేవారు కాదని, నేడు అర్హులందరికీ పింఛన్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయనకి అండగా నిలవాలని ఆమె కోరారు. వడమాలపేట మండలంలో 5,099 మందికి పింఛన్ ఇస్తుండగా, కొత్తగా 183 మందికి పింఛన్లు మంజూరు చేశారని మంత్రి చెప్పారు. వడమాల పేట మండలంలో ప్రస్తుతం మొత్తం 5,282 మందికి రూ.1,46,88,750 పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోశయ్య, ఎంపీడీఓ అరుణ, డీసీసీబీ బ్యాంక్ వైస్ చైర్మన్ కరుణాకర్‌చౌదరి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు లోకేష్‌రెడ్డి, ఉపేంద్ర, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, ఎంపీటీసీ సభ్యుడు రవి, సర్పంచ్‌లు అంజెమ్మ, శ్రీవిద్య, ధర్మయ్య, నాయకులు రమేష్‌రాజు, మునిశేఖర్, కృష్ణారెడ్డి, నందయ్య,కృష్ణయ్య, వెంకటరెడ్డి, మునిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి


సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కార్వేటినగరం: భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేను చాత్రోపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)కళాశాల ప్రిన్సిపల్ చెంగల్రాజు అన్నారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డైట్ కళాశాలలో చాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా, రచయితగా, మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే చేసిన కృషి మరువలేదనిదన్నారు. దాదాపు 125 సంవత్సరాల క్రితం అప్పటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని సావిత్రిబాబు పూలే మహిళా విద్యకు చేసిన కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అలాగే డైట్ ఆవరణలో ఉన్న ఆదర్శ పాఠశాలలో హెచ్‌ఎం గాజుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి


సదుం: ఏనుగులు ధ్వంసం చేసిన చెరుకుతోట

సదుం: మండలంలోని జోగివారి పల్లె పంచాయతీ పరిధిలో పంట పొలాలపై సోమవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మహేశ్వరనాయుడు, నవీన్‌కు చెందిన రెండెకరాల చెరుకు తోటను ఏనుగులు తొక్కి ధ్వంసం చేశాయి. బాలకృష్ణకు చెందిన మామిడి తోటలో చెట్లు విరి చేశాయి.

ఇక వివాహ రిజిస్ట్రేషన్లు ఆన్‌లైన్‌లో..

- స్లాట్ బుకింగ్ అవకాశం
- ఆన్‌లైన్‌లోనే సర్టిఫికెట్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- డీఆర్ శ్రీనివాసరావు

చిత్తూరు కార్పొరేషన్: వివాహ రిజిస్ట్రేషన్ విధానాన్ని ఆన్‌లైన్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) శ్రీనివాసరావు తెలిపారు. గతంలో మ్యానువల్ పద్ధతిలో ఈ ప్రక్రియ జరిగేదని, ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలన్నారు. registration.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఎస్ఎస్‌సీ లేదా డేటా ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, వివాహ పత్రిక, వివాహ ఫొటో, వధూవరుల బంధువులు ముగ్గురి ఆధార్‌కార్డులను సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. దీని ఆధారంగా సంబంధిత వారికి స్లాట్ సిస్టమ్ ద్వారా అపాయింట్‌మెంట్ వస్తుందన్నారు. ఏ రోజు, ఏ సమయంలో ఏ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలో తెలుస్తుందన్నారు. ఆ సమయంలో సంబంధిత వ్యక్తులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రికార్డ్‌లో సంతకాలు పెట్టాలన్నారు. తదనంతరం సబ్‌రిజిస్ట్రార్ ఆన్‌లైన్‌లో డిజిటల్ సిగ్నేచర్ చేస్తారన్నారు. చివరిగా వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లోనే తీసుకోవచ్చన్నారు. ప్రత్యేక వివాహ సర్టిఫికెట్లను సైతం ఇలాగే నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో సంవత్సరానికి 2వేల వివాహ రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా అందులో చిత్తూరులోనే వెయ్యి వరకు అవుతున్నాయన్నారు.

వినాయకునికి వెండి కిరీటం బహూకరణ


అధికారులకు వెండి కిరీటం అందజేస్తున్న దాత

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారికి హైదరాబాద్‌కు చెందిన శివకుమార్ వెండి కిరీటం బహూకరించారు. మంగళవారం రాత్రి దాత కాణిపాకం చేరుకుని స్వామివారికి సుమారు 1.20 లక్షల విలువైన 1,400 గ్రాముల వెండితో తయారు చేసిన కిరీటాన్ని ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబుకు అందజేశారు. ఆయనకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

బీమా కంపెనీకి 'ఫోరం' వడ్డన

చిత్తూరు అర్బన్: బీమా పాలసీ తీసుకున్న వ్యక్తి మరణిస్తే, నామినీకి క్లెయిమ్ ఇవ్వడానికి నిరాకరించిన కంపెనీ నిర్వాహకులను జిల్లా వినియోగదారుల కమిషన్ (ఫోరం) తప్పు పట్టింది. మృతుడి భార్యకు రూ.13.97 లక్షల బీమా క్లెయిమ్ మొత్తాన్ని ఇవ్వాల్సిందేనంటూ ఫోరం అధ్యక్షురాలు అనిత, సభ్యులు సలీం, కోమల మంగళవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. వెదురుకుప్పం మండలం జీటీ కండ్రిగకు చెందిన గుణశేఖర్‌రెడ్డి పాత తుక్కు వ్యాపారం చేసేవాడు. ఇతను చిత్తూరు నగరంలోని కట్టమంచిలో ఉన్న భారతి ఆక్సాలైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ నుంచి 2018 ఆగస్టులో పాలసీ తీసుకున్నాడు. ఏటా రూ.99 వేలు చెల్లించేలా రూ.13.97 లక్షలకు పాలసీ తీసుకోగా, 2021లో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. బీమా సొమ్ము ఇవ్వాలని మృతుడి భార్య అనసూయ కంపెనీ నిర్వాహకులను కోరితే.. వాళ్లు పట్టించుకోలేదు. దీంతో ఆమె ఫోరంను ఆశ్రయించారు. కంపెనీ నిర్వాహకుల సేవాలోపం కనిపిస్తోందని, మృతుడి భార్య నామినీగా ఉండడంతో బీమా సొమ్ము రూ.13.97 లక్షలు, రూ.10 వేలు నష్టపరిహారం, రూ.5 వేలు కోర్టు ఖర్చులకు చెల్లించాలని, ఈ మొత్తం కూడా ఎనిమిది వారాల్లోపు ఇవ్వాలని బీమా కంపెనీ నిర్వాహకులను ఆదేశించింది.

ఆన్‌లైన్ సంస్థ వేధింపులకు యువకుడి బలి

పెనుమూరు(కార్వేటినగరం): ఆన్‌లైన్ సంస్థ యాజమాన్యం వేధింపులకు ఓ యువకుడు బలయ్యాడు. ఈ ఘటన పెనుమూరు పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు...పెనుమూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన లేట్ శివ, కుమారమ్మ దంపతుల కుమారు జానకిరామ్(35) తన సొంత ఖర్చులకు కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆన్‌లైన్ సంస్థ నుంచి రూ.80 వేలు రుణం తీసుకున్నాడు. అయితే కంతులు వారీగా తిరిగి చెల్లించలేక పోవడంతో ఆన్‌లైన్ సంస్థ యాజమాన్యం అతడిని వేధింపులకు గురిచేసింది. దీంతో జానకిరామ్ తాను ఆన్‌లైన్ ద్వారా తీసుకున్న అప్పును తిరిగి కట్టలేక, కుటుంబ సభ్యులను ఇబ్బందులు పెట్టలేక, ఆన్‌లైన్ సంస్థ వేధింపులు తట్టుకోలేక మృతి చెందుతున్నట్లు, తన మృతికి ఎవరూ బాధ్యులు కారని లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై పెనుమూరు ఎస్ఐ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా తమకు ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు


పవన్‌కుమార్‌ను అరెస్టు చూపుతున్న డీఎస్పీ రవికుమార్

కార్వేటినగరం : భార్య హత్య కేసులో భర్తను మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్లు నగరి డీఎస్పీ రవికుమార్ తెలిపారు. డీఎస్పీ కథనం మేరకు.. టీకే పేట దళితవాడకు చెందిన మురళి కుమారుడు పవన్‌కుమార్, అలియాస్ పవన్(23)కు 2020లో వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం గుట్టమీదఇండ్లు దళితవాడకు చెందిన జ్యోతి(19)తో వివాహం జరిగింది. అయితే పవన్‌కుమార్ వివాహం అయిన మరుసటి సంవత్సరం నుంచి మరో యువతితో వివాహేతర సంబంధం నడిపాడు. ఆ విషయాన్ని తెలుసుకున్న భార్య జ్యోతి పవన్‌కుమార్‌ను ప్రశ్నిస్తూ వచ్చింది. దీంతో పవన్‌కుమార్ భార్యను కట్నం తీసుకురావాలని వేధిస్తుండేవాడు. ఈ విషయమై భార్యాభర్తలు తరచూ గొడవపడేవారు. శనివారం పవన్‌కుమార్ ఫోన్‌లో తాను వివాహేత సంబంధం పెట్టుకున్న యవతితో మాట్లాడడం గుర్తించిన జ్యోతి భర్తను మందలించింది. దీంతో ఆగ్రహించి పవన్‌కుమార్ జ్యోతిని గోడకేసి గట్టిగా కొట్టడంతో ఆమెను మృతి చెందింది. దీంతో జ్యోతి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పవన్‌కుమార్‌ను మంగళవారం రాత్రి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కేసు ఛేదించిన సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ దస్తగిరి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

800 వందల మంది విద్యార్థులకు చేయూత


విద్యాభ్యసన సామగ్రిని పరిశీలిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: వైఎస్సార్ సీపీ నేతలు 800 వందల మంది విద్యార్థులకు అభ్యసన సామగ్రి వితరణ చేసి, చేయూత నిచ్చారు. కొత్త సంవత్సరం రోజున పుష్పగుచ్ఛాలు, శాలువలకు బదులుగా పిల్లలకు ఉపయోగపడే నోటు పుస్తకాలు, అభ్యసన సామగ్రి తీసుకురావాలని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. దీంతో ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు నోటు పుస్తకాలు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు, ఇతర అభ్యసన సామగ్రిని ఆయనకు అందజేశారు. వాటిని మంగళవారం విజయానందరెడ్డి చిత్తూరు నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని దాదాపు 800 మంది విద్యార్థులకు కార్యకర్తల చేతుల మీదుగా పాఠశాలలకు అందజేశారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలో ఇన్ పేషెంట్లుగా ఉన్న రోగులకు వేడి నీటి ఫ్లాస్కులను, మాస్కులు, శానిటైజర్ తదితర వస్తువులను సైతం పంపిణీ చేశారు.

కర్షక సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించండి


ముక్తభారత్ అభియాన్ చెక్కును కలెక్టర్‌కు అందజేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : వ్యవసాయఅధికారులు క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, పరిష్కరించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో కలెక్టర్ వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పంటల సాగుకు అనుకూలించే ప్రతి సెంటు భూమిలో పంటలు పండించేలా చర్యలు చేపట్టాలన్నారు.

పారదర్శకంగా సేవలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న ఎరువులు, విత్తనాలు ఇతరత్రా సేవలను పూర్తి పారదర్శకంగా రైతులకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రబీ - 2022 సీజన్‌కు ఈ-కర్షక్ ద్వారా 14,254 మంది రైతులకు చెందిన 17,864 ఎకరాలు ఈ-క్రాప్ నమోదు చేశారన్నారు. మాండూస్ తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలను పంపిణీలో భాగంగా 137.63 హెక్టార్లలో వేరుశనగ పంట నష్టపోయి న 382 మందికి 201 క్వింటాళ్ల వే రుశనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. 2022-23 రబీలో 8,578.8 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేయగా, పీఎం కిసాన్‌లో ఇప్పటి వరకు 1,46,197 మంది రైతులు భూము లకు ఈకేవైసీ చేయించారన్నారు. రబీలో డిసెంబర్ వరకు 1,650 క్వింటాళ్ల వేరుశనగ, 42.6 క్వింటాళ్ల మినుములు, 11.2 క్వింటాళ్ల పచ్చిపెసల విత్తనాలను పంపిణీ చేశారన్నారు. ఆర్బీకేల ద్వారా ఖరీఫ్‌లో 8,389 మెట్రిక్ టన్నులు, 2022-23 గాను డిసెంబర్ 31 నాటికి 6,048 మెట్రిక్ టన్నుల మొత్తం 12,036 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతుల ఇంటి వద్దకే చేర్చామని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో ఏడీఏ వాసు, డీడీఏ సాయిల్ కన్జర్వేషన్ అధికారి హబీబ్‌బాషా, ఏడీలు శివకుమార్, ఉమ, అన్నపూర్ణదేవి, సౌభాగ్యలక్ష్మి, దీక్షా కుమారి, నాగ పద్మిని, గోపాల్ పాల్గొన్నారు.

సురక్షిత నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

ప్రజల ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం గ్రామాల్లో సురక్షితమైన మంచి నీటి సరఫరాపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై డీపీ ఓ లక్ష్మి, డీపీఎంఓ షణ్ముగంతో కలసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 15 రోజులకు ఒక సారి నీటి ట్యాంక్‌లను కచ్చితంగా శుభ్రం చేయించాలన్నారు. నీటి ట్యాంకులను శుభ్రం చేసే ఫొటోలను సంబంధిత యాప్‌ల్లో అప్‌లోడ్ చేయాలన్నారు.

జిల్లా పురోగతిని వివరించిన డీపీఓ

జిల్లాలో 697 పంచాయతీల్లో 591 చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలున్నాయని, కొత్తగా 97 మంజూరు అయ్యాయని డీపీఓ లక్ష్మి తెలిపారు. గ్రౌండ్ ట్రూతింగ్ 85 గ్రామాల్లో చేస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు.

అర్బన్ హెల్త్ సెంటర్ల పనులు వేగవంతం

జిల్లాలో మున్సిపాలిటీల్లో నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లతో అర్బన్ హెల్త్ సెంటర్ల పురోగతి, టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు.

పరీక్షల నిర్వహణలో అలసత్వం వద్దు

జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు నిర్వహించే పరీక్షల్లో అలసత్వం వహించకూడదని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌కు వైద్య ఆరోగ్యశాఖ అందజేస్తున్న రూ. లక్ష నగదు సహాయం చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. జేసీ వెంకటేశ్వర్, డీఎంఅండ్ హెచ్ఓ ప్రకాశం, అదనపు జిల్లా వైద్యాధికారి హరినాథరెడ్డి, డీపీఎంఓ శ్రీనివాసరావు, డీఏఓ రవిరాజు, డాక్టర్ సుదర్శన్, ఆరోగ్యశ్రీ జిల్లాఅధికారి రాజశేఖర్‌రెడ్డి, డీఎంఓ శ్రీనివాసులు, ఎస్ ఓ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

6న ఉచిత మోడల్ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులు ఉచిత మోడల్ పరీక్షను వినియోగించుకోవాలని కుట్టి స్టడీ సర్కిల్ డైరెక్టర్ పవనకుమారి అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తమ కోచింగ్ సెంటర్‌లో ఈ నెల 6 వ తేదీన ప్రిలిమనరీ పరీక్ష తరహాల్లో 200 మార్కులకు ఉచిత మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష రాసేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 5 వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9491844963 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి

చంద్రగిరి: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శేషాపురం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. చంద్రగిరి కొత్తపేటకు చెందిన సతీష్(47) కేబుల్ ఆపరేటర్. మంగళవారం సాయంత్రం శేషాపురం వద్ద కేబుల్ వైరు లాగుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ లైను తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. సతీష్ కుటుంబానికి ఆయన సంతాపం తెలియజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.